ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేత



మన్సూరాబాద్: డివిజన్ పరిధి గణేష్‌నగర్‌కాలనీలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు జిల్లా సర్వే అధికారి వి.శ్రీరామ్ శనివారం ఎగ్జామ్స్ ప్యాడ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాణి కాజీపురం, ఉపాధ్యాయులు రామేశ్వరీ, చంద్రకళ, పుష్పలత పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వనస్థలిపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వనస్థలిపురం డివిజన్ పరిధిలోని చింతలకుంట జనప్రియహోమ్స్ కాలనీలో శ్రీ గోదా, పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలిల ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరమ్మ యాదవ్, నరసింహారావు, జ్యోతి సాయి, ఉరమ, రాజేశ్వరి, పద్మావతి పాల్గొన్నారు.

వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగోలు: తెలంగాణ గీతా కార్మికుల సంక్షేమం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ గీత కార్మికుల ప్రమాదాల నివారణ కోసం గౌడ్స్ కులదైవం కాటమయ్య పేరుతో చేపట్టిన కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ మూకులు) పంపిణీ చేయడం నిజంగా చరిత్రాత్మం అని తెలంగాణ గౌడ సంఘం నాయకులు పల్లె లక్ష్మణరావు గౌడ్, బద్దం ధనుంజయ్ గౌడ్ అన్నారు. శనివారం తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో నాయకులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కలిసి గీతా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.

నిధులు రాక.. పనులు సాగక



అసంపూర్తి నిర్మాణంలో తుక్కుగూడ సమీకృత మార్కెట్ యార్డ్

- నిలిచిన మార్కెట్‌యార్డ్ నిర్మాణ పనులు
- రెండేళ్లుగా ముందుకు సాగని వైనం

తుక్కుగూడ: ప్రజలకు కూరగాయలు, పండ్లు, మాంసం తదితర నిత్యావసర సరకులు ఒకే ప్రదేశంలో లభించాలన్న ఉద్దేశంతో.. గత ప్రభుత్వం పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ యార్డ్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అయితే పూర్తి స్థాయిలో నిధులు అందక పోవడంతో నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

అసంపూర్తిగా భవనం ..

తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో సమీకృత మార్కెట్ యార్డ్‌ను ప్రస్తుత వారాంతపు సంత ప్రదేశంలో 2022లో నాటి మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్.. రూ.4.5 కోట్లతో నిర్మాణ పనులను ప్రారంభించారు. భవన నిర్మాణ పనులు మొదట్లో వేగంగా జరిగాయి. రెండు అంతస్తుల వరకు పై కప్పు పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో గుత్తేదారులకు ప్రభుత్వం నిధులు సమకూర్చకపోవడంతో రెండేళ్లుగా నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

అసాంఘిక కార్యకలాపాలకు..

నిర్మాణంలో ఉన్న మార్కెట్ యార్డ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి వేళలో నిత్యం మందుబాబులు పార్టీలు చేసుకోవడంతో యార్డు, పరసరాలు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. అసౌకర్యంగా భావించిన ప్రాంత ప్రజలు.. పుర అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతోసమీకృత మార్కెట్‌కు అధికారులు రక్షణ వలయాలు ఏర్పాటు చేశారు.

ప్రత్యేకాధికారి పరిశీలన

నిర్మాణంలో ఉన్న మార్కెట్‌ను మున్సిపల్ ప్రత్యేక అధికారి(సీడీఎంఏ జేడీయూ) శ్రీనివాస్ గత నెలలో అధికారులతో కలిసి పరిశీలించారు. మార్కెట్ నిర్మాణం ఏ దశలో ఉంది, పనులు ఎందుకు నిలిచిపోయాయో తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తి కావడానికి నిధులు ఎంత కావాలో ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

పనులు పూర్తి చేయాలి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమీకృత మార్కెట్ కోసం నిధులు కేటాయించింది. పనులు ప్రారంభించింది. సగం వరకు పూర్తయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం నిధులు ఇవ్వక పోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వెంటనే నిధులు విడుదల చేసి, పనులు పూర్తి చేయాలి

– బాదావత్ రవినాయక్, మాజీ కౌన్సిలర్

త్వరలో ప్రారంభం

సమీకృత మార్కెట్ యార్డ్‌కు ప్రభుత్వం.. పెండింగ్ నిధులను విడుదల చేసింది. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తాం. అనంతరం వినియోగంలోకి తెచ్చేందుకు కృషిచేస్తాం.

– ఎ.యాదయ్య, డీఈఈ తుక్కుగూడ

నేడు రీడింగ్ రూమ్ ప్రారంభం

నాగోలు: నాగోలు శ్రీ సాయినగర్ కాలనీ రోడ్డు నెంబర్–2లోని సీనియర్ సిటిజన్స్ ఫోరం గ్రంథాలయంలో నూతనంగా నిర్మించిన పఠన మందిర(రీడింగ్ రూమ్‌ను) ఆదివారం తెలంగాణ స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ ప్రారంభిస్తున్నట్లు సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు దయానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం జీవో నెంబర్118 నిలిపివేత– తద్వారా వచ్చిన కన్వేయన్స్ డీడ్ సమస్యలు–పరిష్కారంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పోచమ్మ దేవాలయం నుంచి సహారా సెకండ్ గేట్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌చార్జి ఏసీపీ శ్యామ్‌సన్, సెక్షన్ అధికారి అక్బర్, చైన్‌మెన్లు శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

పెంచిన ఫీజులు తగ్గించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హయత్‌నగర్: హయత్‌నగర్ జీ స్కూలు యాజమాన్యం ఫీజులను విపరీతంగా పెంచిందని, ప్రభుత్వం జోక్యం చేసుకుని ఫీజులను తగ్గించాలని మరోసారి శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. పాఠశాల నుంచి జాతీయ రహదారి మీదుగా భాగ్యలత వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా స్కూలు యాజమాన్యం 30 నుంచి 50 శాతం ఫీజులను పెంచారని, విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతుండడంతో ఫీజులు చెల్లించలేని తల్లిదండ్రులలో ఆందోళన నెలకొందని తెలిపారు. ఫీజులు తగ్గించాలని పలుమార్లు యాజమాన్యాన్ని కోరినా పట్టించకోవడం లేదని విద్యను వ్యాపారంగా చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు పెంచుతున్నారన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు.కొత్తపేట డివిజన్ కమర్షియల్ టాక్స్ కాలనీలో శనివారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి పర్యటించారు. కమర్షియల్ టాక్స్ కాలనీలో రూ. 34 లక్షల వ్యయంతో చేపడుతున్న అసోసియేషన్ కమ్యూనిటీ నిర్మాణం పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. సకాలంలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్లకు మరమమ్మతు చేయాలన్నారు. కాలనీలో కాలనీలో రోడ్లన్నీ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్పొరేటర్ వెంట రవీందర్, విశ్వేశ్వర్ రావు, నర్సింగ్ రావు, దీక్షితులు, రాములు, యు రాజు, రామకృష్ణ, సురేందర్ చారి, ప్రదీప్ కుమార్, కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి, తోట మహేందర్ యాదవ్ ఉన్నారు.

త్వరలో జూనియర్ సివిల్ జడ్జిల నియామకాలు

హయత్‌నగర్: సివిల్ జడ్జిల కొరత కారణంగా కేసులు పేరుకుపోతున్నాయని, త్వరలోనే జూనియర్ సివిల్ జడ్జిల నియామకాలు పూర్తిచేస్తామని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పి.శాంకోషి అన్నారు. శనివారం హయత్‌నగర్‌లోని 14వ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన బార్ అసోషియేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జూనియర్ జడ్జిల నియామకానికి ఉన్న అడ్డంకులను తొలగిస్తామన్నారు. హయత్‌నగర్ కోర్టు ఆవరణ చాలా విశాలంగా ఉందని, ఇక్కడ న్యాయవాదులకు కావాల్సిన సౌకర్యాలు సమకూరుతాయన్నారు. న్యాయమూర్తులు విజయ్‌సేనారెడ్డి, నందికొండ నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. హయత్‌నగర్ కోర్టు పరిధిలో మూడు ప్రధాన పోలీస్‌స్టేషన్లు ఉండండతో కేసుల పరిష్కారంలో ఆలస్యమవుతుందన్నారు. సుమారు 8 వేల వరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆ కేసులను పరిష్కరించాలంటే ఎంతో సహనం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు భిక్షపతిగౌడ్, జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి, మెజిస్ట్రేట్ సల్మాఫాతిమా, మూచ్యూవల్ ఏయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు శ్రీనాథ్ పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న న్యామూర్తి శాంకోషి

సమాజ సేవ చేస్తా



మధిర సత్యనారాయణను సన్మానిస్తున్న ఉద్యోగులు

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి పదవీవరణ పొందిన మధిర సత్యనారయణ పదవీ విరమణ అభినందన సభను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జీఎస్ఐలోని మల్టీపర్పస్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎస్ఐ ఏడీజీ సూరజ్ దామోజీ పటభాజీ హాజరై మధిర సత్యనారాయణను సన్మానించారు. ఈ సందర్భంగా మధిర సత్యనారాయణ మాట్లాడుతూ.. 1985లో జీఎస్ఐలో ఉద్యోగిగా చేరి వివిధ హోదాల్లో విధులు చేపట్టడం జరిగిందన్నారు. అంతేకాక ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేశానన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎల్‌పీసింగ్, ఎస్ఎస్ పాత్ర, అన్షుమాన్ ఆచార్య, సచ్చి, హార్మోహన్ మిషరా, తారకేశ్వర్‌రావు, కబీ రాజ్‌సెతి, రాజగోపాల్, ఉద్యోగ సంఘాల నేతలు ఆదర్ల మహేష్, చక్రేశ్వర్, రాజశేఖర్, ఆనంద్, చంద్రయ్య, శివశంకర్ పాల్గొన్నారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణకోసం ప్రభుత్వం ఓ వైపు చెట్లను పెంచుతుంటే మరోవైపు కొందరు వాటిని నరికివేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పంచాయతీ రాజ్ టీచర్స్ కాలనీ సెంటర్ ఫర్ సోషియో కల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ కమిటీ సెక్రటరీ సన్ని హెరాక్లియస్ అన్నారు. కాలనీలో 20 ఏళ్ల క్రితం తమ సంస్థ ఆధ్వర్యంలో కానుగ చెట్లను పెంచితే అటవీ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పూర్తిగా నరికివేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

అమరులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నాగోలు: ఎస్సీ వర్గీకరణ కోసం సాగిన ఉద్యమంలో మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ అన్నారు. శనివారం ఎల్‌బీనగర్‌లోని మహనీయుల విగ్రహల వద్ద మాదిగ అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. అమరుల త్యాగాలతోని ఎమ్మార్పీఎస్ ఉద్యమం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ మాదిగ, రాజు, బుచ్చన్న, శేఖర్, పరుశరాం, పెద్ద హుస్సేన్, మౌలాలి, వెంకటేష్,రంగన్న, సునీల్, రాజు, సతీష్, శేషు, సురేష్, రాములు, యాదయ్య, యాదగిరి, నుమన్, అడివయ్య, చిన్న, హుస్సేన్, లక్ష్మన్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుతాం



మాట్లాడుతున్న ఎల్లయ్య

హస్తినాపురం: పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తాము పోరాటాలు చేస్తామని జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం పార్టీ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అన్నారు. శనివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలో సమస్యలపై ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై ప్రభుత్వంపై సీపీఎం పార్టీ పోరాటాలు చేస్తుందన్నారు. ఈ సర్వేలో వచ్చిన సమస్యలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడానికి ఈ నెల 27 కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ. ఖమర్, పాట్టిపాక రామస్వామి, అమితాబేగం, మనెమ్మ, ఎల్లమ్మ, సుజాత, ప్రేమలత, సరిత, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత రేవంత్‌రెడ్డిదే



నియామక పత్రాన్ని అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

హస్తినాపురం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఎల్‌బీనగర్ హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఏఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో ఆయన స్థానిక కార్పొరేటర్ సుజాతానాయక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు, ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగాల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాహుల్‌గాంధీ నిరుద్యోగ సమస్యను రూపుమాపే విషయంపై పోరాడుతున్నారన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో దేశ విదేశాల నుంచి కంపెనీలు తెలంగాణకు వస్తున్నాయని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫాక్స్‌కాన్ కంపెనీ నగరానికి 70 కిలోమీటర్ల పరిధిలో ఉచిత బస్సు, ఉచిత భోజనం,ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలను కల్పిస్తూ ఉద్యోగాలు ఇస్తున్నారన్నారు. ఎల్‌బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ప్రాంతాల వాసులు ఉద్యోగాలు పొంది ఆర్థికంగా ఉపశమనం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జితేందర్, శశిధర్‌రెడ్డి, వజీర్‌ప్రకాశ్‌గౌడ్, అశోక్‌గౌడ్, నెలపాటి రామారావు, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తపాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తాం

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధి వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్‌కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించనున్న వాకింగ్ ట్రాక్, వాటర్‌బోర్, చిల్డ్రన్ ప్లే ఎక్విప్మెంట్ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన వసతులు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పవిత్ర, మహేశ్‌గుప్తా, యాదగిరి, రాజశేఖర్, రామ్మోహన్, రఘుపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసరావు, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

వనస్థలిపురం: వనస్థలిపురంలోని లయోల మోడల్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యాసంస్థల చైర్మన్ రంగినేని వెంకట్‌రావు, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని బహిర్గతం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనలు ఆకట్టుకున్నాయి.

కాకతీయ పాఠశాలలో..

మన్సూరాబాద్: డివిజన్ పరిధి సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని కాకతీయ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వైస్ చైర్మన్ ఎస్. వెంకట్‌రెడ్డి, జోనల్ ప్రిన్సిపాల్ రమేష్‌చంద్ర డైరెక్టర్లు రవిప్రసాద్, రాధ, ప్రిన్సిపాల్ పరిమళ పాల్గొన్నారు.



నమూనలు పరిశీలిస్తున్న వెంకట్‌రెడ్డి



విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్